

గుట్టను తవ్వేస్తున్నారు

- మైనింగ్ అనుమతుల పేరిట అక్రమం
- పట్టించుకోని అధికారులు



నర్సంపల్లి శివారులో తవ్వుతున్న బెల్లం గుట్ట 4

సన్న వడ్లకు బోనస్ రూ.500

- కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

బల్మూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మన్‌పేట గ్రామంలోని పీఏసీఎస్ కొండనాగులలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో రాజవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సయ్యయాదవ్, వైస్‌చైర్మన్ కుర్మయ్య, వ్యవసాయశాఖ మండల అధికారి నరేష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

అడ్డొస్తున్న అహం.. అందని న్యాయం..

- పోలీస్ స్టేషన్‌లలో సమస్య పరిష్కారం కాక ఎస్పీల వద్దకు బాధితులు
- ఎస్పీలు మళ్లీ పీఎస్‌లకే అప్పగింత
- తమను కాదని బాస్ వద్దకు వెళ్తారా? అని బాధితులపై సీనియర్ పోలీసుల ఆగ్రహం
- కౌంటర్ కేసులు పెట్టిస్తున్న కొందరు పోలీసులు
- స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు
- ఎస్పీల ఆదేశాలు బుట్టదాఖలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లను శాసిస్తున్న వైట్ కాలర్



మహబూబ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పోలీస్ ఆఫీసర్లుగా చెలామణి అవుతున్న కొందరి తీరు పోలీస్ శాఖకు అప్రతిష్ఠ తెచ్చిపెడుతోంది. బాధితుల కన్నీళ్లకు వారి మనసులు కరగడం లేదు. న్యాయం కోసం ఠాణా మెట్లెక్కినవారిని చెప్పులరిగేలా తిప్పుకోవడం, లేదంటే కౌంటర్ కేసులు పెట్టి బలవంతంగా రాజీ చేయడం, అదీ కుదరకుంటే పెట్టిన కేసు తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారుతోంది. కింది స్టేషన్‌లలో న్యాయం జరుగకపోతే బాస్‌ల దగ్గరికి వెళ్లగా.. మళ్లీ కిందికే పంపాల్సి రావడంతో మమ్మల్ని కాదని ఉన్నతాధికారుల దగ్గరికెళ్తే ఏమీ కాదని కొందరు సీనియర్‌లకు అహం అడ్డొస్తోంది. దాంతో బాధితులకు న్యాయం జరుగకపోగా కొన్ని సందర్భాలలో కౌంటర్ కేసులను ఎదుర్కోవాల్సి వస్తోంది. పోలీసులతో వచ్చిన పంచాయితీ ఎందుకని కొందరు రాజీ కుదుర్చుకుంటుంటే.. (మిగతా 4లో..)

● వనపర్తి జిల్లాలోని ఓ సర్కిల్ పరిధిలో స్కీంల పేరుతో పొదుపు చేసిన సొమ్మును కస్టమర్లకు ఇవ్వకుండా ఎగ్గొట్టినందుకు ఓ బాధితుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరుగకపోవడంతో జిల్లా బాస్‌ను కలిశారు. బాస్ సంబంధిత అధికారిని ఆదేశించి, నెల రోజులు దాటినా ఇప్పటికీ సంబంధిత స్టేషన్ అధికారులు కేసులు పెట్టకపోగా, బాధితులెందరున్నారో అందరినీ తీసుకువస్తేనే చర్యలు తీసుకుంటానని చెప్పడంతో బాధితుడు నోరెళ్లబెట్టాడు. వారిని తీసుకురాలేక, అవసరాల కోసం పోగు చేసుకున్న సొమ్మురాక వేసారుతున్నాడు.

● మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ జాబ్ చేస్తున్నాడు. ఈయనను అదే సంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగంలోంచి తొలగించే ప్రయత్నం చేయగా, అతను వినకపోవడంతో అందరూ కలిసి కిడ్నాప్ చేశారు. వారి చెర నుంచి తప్పించుకుని వచ్చిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలిసిన కిడ్నాపర్లు ఓ మహిళతో తనను వేధింపులకు గురిచేశాడని కౌంటర్ కేసు పెట్టించారు. ఇరువురిపైనా కేసులు నమోదుకావడంతో ఎవరిపైనా చర్యలు తీసుకోకుండా కేసును పెండింగ్‌లో ఉంచారు. కిడ్నాప్‌నకు గురైన బాధితుడు తనను కిడ్నాప్ చేసి, హత్యకు ప్లాన్ చేశారని కిందిస్థాయి పోలీస్ అధికారుల చుట్టూ తిరిగి, చివరకు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ నుంచి స్టేషన్‌కు ఫిర్యాదు పంపించి రెండు నెలలవుతున్నా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బ్లాక్‌ల వారీగా కుటుంబాల జాబితా

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



సర్వేపై అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్ బ్లాక్ వారీగా కుటుంబాల జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో కుటుంబ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం వరకు ప్రతీ ఎన్యుమరేటర్‌కు ఉత్తర్వు కాపీ అందాలని, ఇంకా ఎవరైనా శిక్షణ పొందని వారు ఉంటే తక్షణమే శిక్షణ ఇవ్వాలని జిల్లా ప్రణాళికా అధికారిని ఆదేశించారు. ఈనెల తొమ్మిది నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్నందున ఆరోతేదీ నుంచి ఎనిమిదో తేదీ లోపు బ్లాక్‌ల లో కుటుంబాల జాబితా సిద్ధం చేయాలన్నారు. ప్రతీ ఇంటిపై సమాచార స్టిక్కర్‌ను అతికించాలని సూచించారు. సర్వేకు అవసరమైన మెటీరియల్ వెంటనే అందరూ ఎన్యుమరేటర్లకు అందజేయాలని ఆదేశించారు. సమా వేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సీపీవో భూపాల్‌రెడ్డి, ఏవో భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రకృతి సేద్యం.. జీవన మార్గం

- సేంద్రియ వ్యవసాయంలో మహిళా రైతు
- కృషిరత్న పురస్కారాన్ని అందుకున్న లావణ్య
- భర్త రమణారెడ్డి సహకారంతో పంటల సాగు

4



పత్తి పొలాలో లావణ్య(ఫైల్)

ఆశించిన దిగుబడులు రాక నష్టపోయి కొంత పొలాన్ని అమ్ముకున్నారు. ఆ తర్వాత ప్రముఖ వ్యవసాయవేత్త సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించారు. అధిక దిగుబడులు సాధించి లాభాల బాట పట్టారు.. తాము అమ్ముకున్న పొలాన్ని తిరిగి కొనుగోలు చేశారు. ఈ ఘనత సాధించినది నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం కార్వంగ గ్రామానికి లావణ్య. రమణారెడ్డి దంపతులు.. వారి విజయ ప్రస్థానంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

- తెలకపల్లి, ఆంధ్రజ్యోతి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా భారత్ మాల నిర్మాణం



తప్పెట్లమొర్సు రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

● గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా భారత్ మాల రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నా రు. మంగళవారం మండలంలోని ఆరగిద్ద, తప్పెట్లమొర్సు గ్రామాల మధ్య చేపడుతున్న భారత్‌మాల రహదారి పనులను ఎస్ఈ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలసి కలెక్టర్ పరిశీలించారు. అండర్‌పాస్ విషయంలో తప్పెట్లమొర్సు గ్రామస్థులకు తలెత్తిన రహదారి సమస్యపై హైవే అథారిటీ అధికారులతో కలసి గ్రామస్థులతో చర్చించారు. భారత్‌మాల రహదారి పనులను మ్యాపింగ్ ద్వారా హైవే అథారిటీ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల భూములకు సర్వీస్ రోడ్లును అనుసంధానం చేస్తామన్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గట్టు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. భారత్‌మాల పనులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత రాణి, రహదారి నిర్మాణ ఇంజనీరు సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆ టేస్టే వేరు

కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ మసాల ప్రత్యేకం 5

వ్యవసాయ క్షేత్రాలా? నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా? 5

సోమశిల వద్ద కృష్ణానదిలో విషాదం

- మైనర్ల ద్వారా చేపల వేట సాగిస్తున్న దళారులు
- పని నచ్చక పారిపోయేందుకు యత్నించిన ఆంధ్ర జాలరి మృతి

కొల్లాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిండుకుండలా ఉన్న కృష్ణా నదిలో అలివి వలలతో చేపల వేట సాగించి కోట్ల రూపాయలు గడించా లన్న దళారుల దురాశ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. చేపలు పట్టడం ఇష్టంలేక వెట్టిచాకిరి భరించలేక పారిపోయేందుకు యత్నించిన మైనర్ అయిన ఆంధ్ర జాలరి కృష్ణానదిలో పడి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మైనార్టీ కూడా తీరని జాలరి నాగరాజును కొన్ని రోజుల క్రితమే తెలంగాణ మత్స్యకారులు కృష్ణానదిలో అలివి వలలతో చేపలు పట్టేందుకు సోమశిలకు తీసుకు వచ్చారు. సోమశిలకు దగ్గరలోని అమరగిరి సమీపాన గట్టు ప్రదేశంలో చేపలవేట సాగించే స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని రోజుల నుంచి తాను చేస్తున్న పని ఇష్టం లేక సొంత ఊరికి పారిపో యేందుకు కృష్ణానదిలో పుట్టి ద్వారా మంగళవారం తెల్లవారుజామున వారి స్థావరం నుంచి సుమన్‌తో కలిసి సోమశిల గ్రామానికి బయలుదేరాడు. గ్రామం సమీపం లోకి రాగానే నీటిపై తేలియాడుతున్న నీడను చూసి ఒడ్డు వచ్చిందని ఇద్దరూ దూకారు. దీంతో వాళ్లు నీట మునిగారు. చేసేది ఏమీ లేక ఒడ్డుకు చేరాలని ప్రయత్నించారు. అందులో సుమన్ అనే యువకుడు ఒడ్డుకు చేరుకోగా నాగరాజు నదిలో మునిగి ప్రాణాలు విడిచాడు. మంగళవారం ఉదయం సుమన్ చెప్పిన వివరాల ప్రకారం మత్స్యకారులు కృష్ణా నదిలో నాగరాజు మృత దేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదే హాన్ని కొల్లాపూర్ ఆసుపత్రిలో ఉంచారు. బుధవారం మృతదే హానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పజెప్పుతామని కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ చెప్పారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో గద్వాల జిల్లాకు ఐదో స్థానం

- అభినందించిన డీజీపీ జితేందర్



డీజీపీ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఐటీసెల్ ఎస్ఐ రజిత

గద్వాలక్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఈఏఆర్ ద్వారా మొబైల్ ఫోన్ల రికవరీ శాతంలో రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులు ఐదోస్థానంలో ఉన్నట్లు మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ లో మంగళ వారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిధిలో ఏప్రిల్-2023 నుంచి అక్టోబరు-2024 వరకు జిల్లా వ్యాప్తంగా 948 సెల్‌ఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకొని సెల్‌ఫోన్ యజమానులకు అందజేశామన్నారు. సెల్‌ఫోన్‌లను గుర్తించి రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఎస్పీ శ్రీనివాసరావును, జిల్లా పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి ఐటీసెల్ ఇన్‌చార్జి ఎస్ఐ రజితకు ప్రశంసాపత్రాన్ని అందించారు..

సర్కారు బడులకు మహర్దశ

● జోగుళాంబ గద్వాల జిల్లాలో 298 పాఠశాలలకు మరమ్మతులు



సివిల్ పనులు పూర్తైన ఉండవల్లి మండలం తక్కశిల జడ్పీ హైస్కూల్

గద్వాలటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల మరమ్మతులకు మోక్షం లభించింది. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ బడులు మరమ్మతుకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడక్కడ కొన్ని పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయించినా శాశ్వత పరిష్కారం లభించలేదు. కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలే కావడంతో మరమ్మతు పనులను ఆ కమిటీలకే అప్పగించింది.

జిల్లాలో 298 పాఠశాలలకు ...

జోగుళాంబ గద్వాల జిల్లాలోని 13 మండలాల పరిధిలో పాఠశాలల సంఖ్య 474 ఉండగా అన్ని పాఠశాలల్లోనూ అధికారులు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేశారు. తొలి విడతగా జిల్లాలో 298 పాఠశాలలను అత్యవసర మరమ్మతులు చేసేవిగా గుర్తించారు. రూ.8,77,69,000లకు పరిపాలనపరమైన మంజూరు లభించగా, ఇప్పటి వరకు రూ.7,88,64,000లు నిధులు ఖర్చు చేశారు. అడ్వాన్స్‌డ్ గా తొలివిడత 25 శాతం, అనంతరం మరో 50 శాతం నిధులు విడుదల చేయగా.. దాదాపు అన్ని బడుల్లోనూ ఇప్పటికే ఆయా కమిటీలు సివిల్ పనులను పూర్తి చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది, తొమ్మిది పాఠశాలల్లో మినహా మరమ్మతు పనులు సివిల్ పనులు ఇప్పటికే పూర్తికాగా, కలరింగ్ పనులు చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 'మన ఊరు-మనబడి', 'మన బస్తీ - మన బడి' పథకంలో భాగంగా 161 పాఠ శాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో దాదాపు 25 బడుల్లో పనులు కనీసం ప్రారంభం కూడా కాకపోగా మిగతా పాఠశాలల్లో పనులు అరకొరగా చేసి బిల్లులు రావేమోనానే భయంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఈ విషయంలో కాంట్రాక్టర్లకు తగిన హామీ ఇచ్చి పనులు చేయించడంలో అటు ఉన్నతాధికారులు, ఇటు ప్రజాప్రతి నిధులు ఉదాసీనత చూపడంతో పనులు నామ మాత్రంగానే మిగిలిపోయా యి. వాటిని పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే పనులు పూర్తి



జిల్లాలో మరమ్మతులు చేపట్టిన అన్ని పాఠశాలల్లో ఇప్పటికే మరుగుదొడ్లు, వైరింగ్ పనులు, తాగునీటి సరఫరా, సీలింగ్ పనులు పూర్తి చేశాము. కలరింగ్ కోసం టెండర్లు ఖరారైనందున త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. అమ్మ ఆదర్శ కమిటీలను సమన్వయం చేస్తూ డిసెంబరులోగా అన్ని పాఠశాలల్లో కలరింగ్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

- రవీందర్, డీఈవో, జోగుళాంబ గద్వాల జిల్లా

పంట కాదు చెరువు

ఈ ఫొటో చూస్తుంటే.. ఇదేదో పంట అనుకుంటున్నారా? కాదు. ఇది చెరువుపై పేరుకున్న గుర్రపు డెక్క. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామ శివారులో ఉన్న జగత్‌పల్లి చెరువులో గుర్రపు డెక్క ఇలా పేరుకుపోయింది. చూడగానే పంటలా కనిపిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' మంగళవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు

● అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



అత్మకూరు పట్టణంలోని కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తక్షణమే ఆత్మకూరు మండలంలో మొత్తం 24 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సూచించారు. సన్న, దొడ్డు రకం వరి కొనుగోలు వేర్వేరుగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు మిల్లర్లు ఎంపిక కాలేదు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడికి పంపాలని పీఏసీఎస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్లోని గోదాములలో నింపాలని, అక్కడ స్థలం సరిపోకుంటే వనపర్తి మండలం చిట్యాల గోదాముకు తరలించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇంటింటి సర్వేలో ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ప్రతీ ఒక్కరురోజు 10 కుటుంబాలకు పైగా ఆధారాలను సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ ప్రసాద్, సింగిల్ విండో అధికారులు , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. జీవన మార్గం

● సేంద్రియ వ్యవసాయంలో మహిళా రైతు
● కృషిరత్న పురస్కారం అందుకున్న లావణ్య
● భర్త రమణారెడ్డి సహకారంతో పంటల సాగు

తెలకపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని కార్వంగకు చెందిన రైతు లావణ్య 20 సంవత్సరాలుగా సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేస్తూ, విజయం సాధిస్తున్నారు. ఆమె గతంలో ఎంపీటీసీ సభ్యురాలిగానూ పని చేశారు. మొదట్లో వారు కూడా అందరిలాగానే రసాయనిక ఎరువులతో పంటలు పండించే వారు. దీంతో భూసారం తగ్గిపోయి పంటలు సరిగా పండక నష్టాలపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు కొంత భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత వారికి సేంద్రియ వ్యవసాయంతో పరిచయం కలిగింది. ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్నారు. సేంద్రియ సాగుపై అవగాహన పెంచుకొని, అదే తమ జీవన మార్గంగా ఎంచుకున్నారు. భర్త రమణారెడ్డితో కలిసి పొలంలో వరి, పత్తి, మిరప, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారు. మొదట 2002లో కనకాంబరం తోటను వేసి, మంచి లాభాలు గడించారు. ప్రస్తుతం ఎకరం పొలంలో మిరప తోట సాగు చేయగా, మూడు కోతల్లో 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఆమె తెలిపారు. అంతర్‌పంటుగా ఆవాలు, ధనియాలు, మెంతులు, వేరుశనగ తదితరాలను పండించామని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక పురస్కారాలను అందుకున్నారు. శ్రీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ నుంచి కృషి రత్న పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు, ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అభినందనలు కూడా అందుకున్నారు. పూర్వ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అంతే కాకుండా ఆసక్తి ఉన్న రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. సాగులో మెళకువలు, జీవామృతం, ఘన జీవామృతం తయారీ పద్ధతులను నేర్పిస్తున్నారు.


సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట(ఫైల్)


భర్తతో కలిసి జీవామృతం తయారు చేస్తున్న లావణ్య(ఫైల్)


మాజీ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న లావణ్య(ఫైల్)

అడ్డొస్తున్న అహం.. అందని న్యాయం..


మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు కోర్టులను, మానవహక్కుల సంఘాలను ఆశ్రయిస్తున్నారు. కింది స్టేషన్‌లలో న్యాయం జరుగకపోతే తమను సంప్రదించాలని ప్రతీ సోమవారం ఆయా జిల్లాల ఎస్పీలు బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నారు. సమస్యలు విని వెంటనే పరిష్కరించాలని ఆయా స్టేషన్‌లకు పంపిస్తున్నా, అవి ఈమేరకు పరిష్కారం అవుతున్నాయో క్రాస్ చెక్ చేసుకోవడం లేదు. దాంతో సోమవారం తీసుకుంటున్న ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి. ఒకసారి ఎస్పీలను కలిసిన బాధితులు మళ్లీ వారి దగ్గరికి వెళ్లే సాహసం చేయక, చివరికి వైట్ కాలర్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పలువురు పోలీస్ అధికారులు సివిల్ కేసులపై చూయిస్తున్న ఆసక్తి.. సామాన్యులకు కేసులపై చూపకపోవడం గమనార్హం.

పీఎస్‌లలో న్యాయం జరగకనే ఎస్పీల వద్దకు

బాధితులెవరైనా కింద స్థాయి పోలీస్ స్టేషన్‌లలో న్యాయం జరుగడం లేదని నిర్ధారణకు వచ్చిన తరువాతనే , సర్కిల్ అధికారి, డీఎస్పీ, ఆ తరువాత ఎస్పీలను కలుస్తారు. ప్రతీ సోమవారం ఎస్పీలు ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా సమస్యలను స్వీకరిస్తున్నారు. ఎస్పీలే నేరుగా ఫిర్యాదులు తీసుకుని, సమస్యలు వింటున్నారంటే తమకు తప్పక న్యాయం జరుగుతుందని బాధితులు నమ్ముతారు. అయితే బాస్‌లు బాధితుల సమస్యలను ఓపిగ్గానే వింటున్నారు. వాటి పరిష్కారం కోసం అధికారులకు లిఖితపూర్వక లేదా మౌకిక ఆదేశాలు ఇస్తున్నారు. కానీ.. ఎస్పీల నుంచి మళ్లీ స్టేషన్‌లకే ఆ ఫిర్యాదులు వెళ్తుండటంతో సమస్య ఎక్కడ మొదలైందో మళ్లీ అక్కడికే చేరుతోంది. దాంతో తమను కాదని పైస్థాయి అధికారులను కలుస్తారా? అని కొందరు సీనియర్ పోలీసుల ఇగో హర్ట్ అవుతోంది. అక్కడికి వెళ్లినా మళ్లీ మావద్దకే వచ్చేదంటూ వారు పలు ఫిర్యాదులను పక్కన పెడుతున్నారు. మరికొందరైతే తమ మాట వినలేదంటూ నిందితులనే పిలిచి వారి చేత కౌంటర్ ఫిర్యాదు చేయించి, కౌంటర్ కేసులు పెడుతున్నారు. దీంతో బాధితుడు కాస్త నిందితుడుగా మారుతున్నాడు. అన్ని కేసుల్లో ఇలానే ఉండదు. ఎస్పీలు ఆదేశించిన చాలా కేసులను పలువురు అధికారులు పరిష్కరిస్తున్నా, కొందరు మాత్రం ఇగోకు తీసుకోవడం వల్ల బాధితులకు తిప్పలు తప్పడం లేదు.

ఫిర్యాదులపై బాస్‌లు దృష్టి సారించాలి

తమ వద్దకు వచ్చిన బాధితులందరికీ న్యాయం చేస్తున్నామనే ఎస్పీలు భావిస్తున్నారు. అయితే తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులపై కింది స్థాయిలో బాధితులకు ఏమేర న్యాయం జరిగిందో ఫోన్ చేసి, క్రాస్ చెక్ చేసే సిస్టమ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇది వరకు కొంతమంది అధికారులు కార్యాలయ సిబ్బందిచేత బాధితులకు ఫోన్ చేయించి, మీ ఫిర్యాదు పరిష్కారం అయిందా? అని అడిగి వివరాలు సేకరించేవారు. ఈ రిపోర్ట్‌ను ఎస్పీలకు అందజేసేవారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో అధికారులకు భయం ఉండేది. ఇప్పుడు ఇలాంటి సిస్టమ్ లేకపోవడంతో పోలీస్ స్టేషన్ అధికారుల నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా మారింది. బాధితులు ఒకసారి ఎస్పీలను కలిశాక రెండోసారి మళ్లీ వారిని కలిసేది చాలా తక్కువ. ఎస్పీలను కలిసిన తరువాత కూడా న్యాయం జరుగలేదంటే పోలీస్ వ్యవస్థ ఇంతే అన్న నిర్ణయానికి వచ్చి సర్దుకుపోతుంటారు. కొందరైతే కోర్టులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. అందుకే ఎస్పీలు తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులను నెలకోసారి ర్యాండమ్‌గా ఏమేర పరిష్కారం అయ్యాయో ఓ విభాగం ఏర్పాటు చేసి, క్రాస్ చెక్ చేయిస్తే బాధితులకు న్యాయం జరగడంతోపాటు పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

● మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన రైతు తాను కొనుగోలు చేసిన పొలంలో పంట సాగు చేశాడు. దాయాదులు ఇది తమ పొలం అంటూ వేసిన పంటను పాడు చేశారు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, వదిలేశారు. ఆ తరువాత కూడా దాయాదులు ఆ పొలంలో ఎలాంటి పనులూ చేయకుండా ఆటంకాలు కలిగిస్తున్నారు. ఈ విషయమై బాధిత రైతు పదేపదే పోలీసుల చుట్టూ తిరిగినా చర్యలు లేకపోవడంతో చివరికి ఎస్పీని ఆశ్రయించారు. నెలదాటినా ఇప్పటివరకు కనీసం వారిని పోలీసులు పిలిచి మాట్లాడలేదంటే జిల్లా బాస్‌ల ఆదేశాలను ఏమేర పాటిస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది.

సీఈఐఆర్ సేవల్లో
జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు ఆరో స్థానం


డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

● జడ్చర్ల సీఐ ఆదిరెడ్డిని ప్రశంసించిన డీజీపీ జితేందర్

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) సేవల్లో జడ్చర్ల పోలీస్ స్టేషన్ రాష్ట్ర స్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ల వివరాలతో బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 459 మొబైల్‌ఫోన్‌లను రికవరీ చేసినందున జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు ఆ స్థానం దక్కింది. రికవరీ చేసిన మొబైల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు అప్పగించి, ప్రజలకు మంచి సేవలను అందించినందుకు సీఐ ఆదిరెడ్డిని డీజీపీ జితేందర్ అభినందించడంతో పాటు ప్రశంసా పత్రం అందించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఆదిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఐపీఎస్‌లు మహేష్‌భగవత్, షికాగోయల్ ఉన్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల సీఐ, సిబ్బందిని ఎస్పీ జానకి అభినందించారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

● తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

నారాయణపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు చేయాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు వద్ద మంగళవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత ఫించన్ విధానం అమలు చేయాలని తెలిపారు.

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 317 జీవో వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాములు, నర్సింగప్ప, జ్యోతి, విజయ, నర్మద, విజయలక్ష్మి, గౌరి, లక్ష్మణ్‌తో పాటు, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో రెండు మేకలు మృతి

● నారాయణపేట జిల్లా గనిమోని బండలో ఘటన

నారాయణపేటరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా బండగొండ పంచాయతీ పరిధిలోని గనిమోని బండలో మేకల కాపరి వెంకటప్పకు చెందిన రెండు మేకలు సోమవారం రాత్రి చిరుత దాడిలో మృతి చెందాయి. కాపరి వెంకటప్ప, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మేకలను అడవిలో మేపి ఇంటికి వచ్చే సమయంలో అకస్మాత్తుగా జీవాలపై చిరుత దాడి చేసింది. దీంతో మేకలు చెల్లాచెదురై రెండు తప్పిపోయాయి. వాటిని కాపరి వెతకగా మంగళవారం ఉదయం గ్రామ శివారులో చనిపోయినట్లు గుర్తించాడు. వాటి విలువ దాదాపు రూ.18వేలు ఉంటుందని కాపరి వాపోయాడు. నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

» 5.3 తులాల బంగారం, 35 తులాల వెండి
» రూ, 3,71,000 విలువైన వస్తువులు స్వాధీనం
» వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.లింగయ్య


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

మరికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు. మరికల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మరికల్ గ్రామానికి చెందిన ముడావత్ హన్మంతు అనే వ్యక్తి ఐదు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ జరుపుకునేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. పండుగ అనంతరం రెండవ తేదీన తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులోని మూడు మాసాల బంగారు కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు వారు మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మక్తల్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు తమ్మిరెడ్డి (45) మరికల్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తాను మక్తల్ మండలం వడ్వాట్ గ్రామానికి చెందిన కోల్బురి నరసింహ (40)తో కలిసి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. ఆయన గత సంవత్సరం మరికల్ మండలం పూసల్‌పహాడ్ గ్రామంలో ఒక ఇంట్లో బంగారు కమ్మ బుట్టలు, వెండి వస్తువులు, 20 వేల రూపాయలు చోరీ చేసినట్లు చెప్పాడు. అలాగే మరికల్ గ్రామంలోని మరో ఇంట్లో బంగారు మకర కుందనాలు, కమ్మబుట్టలు, ఉంగరం, చైన్, గుండ్లు, రెండు గాజులు, ఐదు వేల రూపాయలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఆభరణాలు, నగదును రికవరీ చేశారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళిని డీఎస్పీ అభినందించారు. విచారణ బృందం సభ్యులు రవీందర్, తిరుపతి రెడ్డిలకు క్యాష్ రివార్డులను అందించారు.

బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి
ఫిట్స్‌తో మృతి

పెద్దకొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి ఫిట్స్ వచ్చి చెట్ల పొదల్లో సోమవారం చనిపోయిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పెద్దకొత్తపల్లి ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం వివరాలిలా... బల్మూరు మండలం జిన్‌కుంట గ్రామానికి చెందిన దళిత జిన్కుంట ఎల్లయ్య కుమారుడు గాలయ్య (42)తన పని మీద 20 రోజుల క్రితం జిన్‌కుంట నుంచి పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామానికి వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నాడు. అతనికి తరచుగా ఫిట్స్ వచ్చేది. గాలయ్య సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తన ఇంటికి సమీపంలో ఫిట్స్ రావడంతో కిందపడి ఎవరూ చూడకపోవడంతో అక్కడే ప్రాణాలు విడిచాడు. మంగళవారం ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో ఇంటికి సమీపంలోని చెట్లలో గాలయ్య మృతదేహం కనిపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై మృతుని తల్లి జిన్‌కుంట ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుట్టను తవ్వేస్తున్నారు

ఊర్కొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల పేరుతో గుట్టను తవ్వేస్తున్నారు. రోజు రోజుకు గుట్టలు తరిగి పోతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఊర్కొండ మండలం ఊర్కొండపేట, నర్సంపల్లి గ్రామాలు పచ్చటి పొలాల మధ్య ఉన్న గుట్టలు చూసి మురిసిపోయేవారు. పదేళ్లుగా రోజురోజుకు గుట్టలు తరగిపోతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నర్సంపల్లి శివారులో బెల్లంగుట్టపై మైనింగ్ వ్యాపారుల కన్నుపడింది. వారు పదేళ్ల క్రితం రెండు హెక్టార్ల వరకు అనుమతులు పొందారు. కానీ దానికంటే అధికంగా తవ్వేస్తున్నా అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

బెల్లం గుట్టపై బ్లాక్‌లు (పెద్దదిండ్లు) తయారు చేసి భారీ వాహనాల్లో హైదరాబాద్ తరలించి వాటిని గ్రానైట్‌గా మలుచుతున్నారు. ఒక బ్లాక్ లక్షల రూపాయల ధర పలుకుతుందని అక్కడ పని చేస్తున్న కార్మికుల ద్వారా తెలుస్తోంది. ఇలా మైనింగ్ అధికారులు ఇష్టానుసారంగా అనమతులు ఇవ్వడంతో వడ్డెర జీవితాలు ఇబ్బందిగా మారుతాయని, బ్లాక్‌ల వల్ల లక్షల ఆదాయం ఉండటంతో దళారులు పరిసర గుట్టలపై కన్నేసి అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని వడ్డెర సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. దళారులకు మైనింగ్ అధికారులు వత్తాసు పలికి మైనింగ్ చేయడానికి అనుమతులు ఇస్తే వడ్డెర జీవితాలు బజారున పడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్లం గుట్టను అనుమతుల కంటే ఎక్కువగా ధ్వంసం చేస్తున్నా మైనింగ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బెల్లం గుట్ట వద్ద తొలగించిన రాళ్లు

ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు



ప్రకృతిపరంగా మా గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం ఉండేది. పది సంవత్సరాలుగా బెల్లం గుట్టకు అనుమతులు తీసుకున్నామని కొందరు రాత్రింబవళ్లు పెద్ద పెద్ద బ్లాక్‌లను తయారు చేసి సదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రోజు రోజుకి గుట్టలు తరగిపోతున్నాయి. అధికారులు పర్యవేక్షణ చేసి అనుమతుల కంటే అధికంగా తవ్వుతున్న వ్యాపారి అనుమతులు రద్దు చేయాలి.

- బొల్గం మల్లేష్‌గౌడ్, రైతు, ఊర్కొండపేట

గుర్తు తెలియని యువకుడి
మృతదేహం లభ్యం

అచ్చంపేటటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని పాతబజారు చింతల్ బస్తీలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనట్లు అచ్చంపేట ఎస్ఐ రమేష్ తెలిపా రు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని చింతల్‌బస్తీలో పాడుబడిన ఇంట్లో మృతదేహం ఉన్నట్లు కాలనీలోని కొంతమంది స్థానిక పోలీసులకు, సమాచారం ఇచ్చారు. పోలీ సులు వెంటనే కాలనీలోని పాడుబడి, ఎవరూలే ని ఇంట్లో మృతదేహాన్ని పరిశీలించి అచ్చంపేట ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. యువకునికి దాదాపు 35 సంవత్సరాలు ఉన్నట్లు నీలం, తెలుపు గీతల చొక్కా, ఎరుపు రంగు డ్రాయర్ వెసుకొని ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వ్యక్తులు 8712657732 ఫోన్‌నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పీజీ కళాశాల హాస్టల్‌లో భోజన వసతి కల్పించాలి

- పీయూ వీసీకి బీఆర్‌ఎస్‌వీ నాయకుల వినతి

కొల్లాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పీజీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌కు బీఆర్‌ఎస్‌వీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కొల్లాపూర్ పీజీ సెంటర్‌ను సందర్శించిన పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌ను బీఆర్‌ఎస్‌వీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు శేఖర్ మాట్లాడుతూ పాలమూరు విశ్వ విద్యాలయానికి దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు హాస్టల్లో భోజనం కల్పించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. హాస్టల్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు భోజన సౌకర్యం లేదని కావునా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని భోజనం వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కళాశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కలర్ మహేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌వి నాయకులు

మహిళ అదృశ్యం

అలంపూర్ చౌరస్తా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం బొంకూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ కథనం.. గ్రామానికి చెందిన మాధవి కూలి పని నిమిత్తం పక్క గ్రామమైన చిన్నపోతులపాడు గ్రామానికి పత్తి తీసేందుకు వచ్చింది. ఉన్నట్టుండి ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో పొలం యజమాని రాయచూర్ రోడ్డు వద్ద వదిలిపెట్టాడు. అలంపూర్ చౌరస్తా వైపు వెళ్లే ఆటోలో వెళ్లినట్లు పెట్రోల్ పంపు వద్ద ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. కానీ సమీప గ్రామాల్లో విచారించినా ఆచూకీ కనబడటం లేదని భర్త రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి

వనపర్తి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని లక్ష్మమ్మ, జిల్లా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ కాలేజీ, విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళ సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహం నిర్మూలన, బాలల చట్టాలు, హక్కుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్య క్రమానికి జిల్లా సంక్షే మ అధికారి లక్ష్మమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలని, అందుకు అందరు కృషి చేయాలని పేర్కొన్నారు. బాలికలు బాగా చదువుకుంటే ఉన్నతమైన స్థా నాల్లో స్థిరపడవచ్చని బాల్య వివాహాలు చేసుకోవడంతో వారి బంగారు భవిష్యత్ పాడవుతుందని అవగాహన కల్పించారు. అదే విధంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ భాస్కర్, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిట్రసి సుమ మాట్లాడారు. అమ్మాయిలు ముఖ్యంగా సోషల్ మీడియాలో తగు జాగ్రత్తలు తీసు కోవాలని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వారి వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను షేర్ చేయకూడదన్నారు. సైబర్ నేరాలు ఎక్కడైనా జరిగితే ఎవరన్న ఇబ్బంది కలిగిస్తే.. టోల్ ఫ్రీ నంబరు 1098, 181, 14567, 1930 ఫోన్ చేయాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్, స్పెషలిస్టు ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ సుమ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ

అనారోగ్యంతో యువకుడి మృతి

అచ్చంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని సింగారం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వర్థం ఆంజనేయులు (35)గత కొంత కాలంగా అనార్యోగ సమస్యతో బాధపడు తున్నారు. అనార్యోగంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పరామర్శించారు. మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. మృతుని భార్య సరిత ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న గువ్వల బాలరాజు

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో

ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం



రజత పతకం సాధించిన జిల్లా జట్టుతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు రజత పతకం సాధించింది. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆదర్శ స్పోర్ట్స్ బాలికల పాఠశాల ఆవరణలో ఈనెల రెండు నుంచి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్లు, కరీంనగర్, మెదక్, నల్గొండ జిల్లాల జట్లపై పాలమూరు జట్టు విజయం సాధించి, సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీ ఫైనల్‌లో రంగారెడ్డి జిల్లా జట్టుపై గెలిచి ఫైనల్‌కు చేరింది. తుది పోరులో ఆదిలాబాద్ జిల్లా జట్టుతో హోరాహోరీగా తలపడి 17 - 23 స్కోర్‌తో రన్నర్‌గా నిలిచిందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తఖి యొద్దీన్, శంకర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్, ఎస్జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి అభినందించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అండర్ - 14, 17 అథ్లెటిక్స్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని స్టేడియం మైదానంలో మంగళవారం ఈ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు రమణ, ఆనంద్, కృష్ణయ్య, మెర్సీ, మేరీ పుష్ప, ఉమాదేవి పాల్గొన్నారు.

నేడే అలంకారోత్సవం

కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం









చిన్నచింతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన కురుమూర్తి స్వామి అలంకారోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆత్మకూరు ఎస్‌బీఐ నుంచి ఊరేగింపు

కురుమూర్తి వేంకటేశ్వర స్వామికి ముక్కెర వంశపు రాజులు పలు స్వర్ణాభరణాలను సమర్పించారు. అందులో కిరీటం, కోరమీసం, హస్తాలు, భుజకీర్తులు, శంకు చక్రాలు, పచ్చలు, వజ్ర వైఢూర్యాలు పొదిగిన హారాలు, ముత్యాల హారాలు, మొలగజ్జెలు ఉన్నాయి. ఈ ఆభరణాల పెట్టెను ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాల అనంతరం వనపర్తి జిల్లా ఆత్మకూర్ ఎస్‌బీఐలోని లాకర్లో భద్రపరుస్తారు. అలంకారోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో ఆభరణాల పెట్టెను లాకర్‌లో నుంచి బయటకు తీసుకొస్తారు. అక్కడి నుంచి ఊరేగింపు ప్రారంభం అవుతుంది.

ఊరూరా ప్రత్యేక పూజలు

ఊరేగింపులో గాడీ వంశీయులైన స్వర్ణకారులు ఆభరణాల పెట్టెను తలపై పెట్టుకుని ముందు నడుస్తారు. భారీ పోలీసు బందోబస్తు, భక్తుల గోవింద నామస్మరణ, మంగళ వాయిద్య ఘోష నడుమ ఊరేగింపు కొనసాగుతుంది. ఆభరణాల ఊరే గింపుకు ప్రతీ గ్రామంలో భక్తులు ఘన స్వాగతం పలి కి పూజలు చేస్తారు. ఆత్మకూరు పట్టణం నుంచి పరమే శ్వరస్వామి చెరువుకట్ట మీదుగా మదనాపురం మండలం కొత్తపల్లికి ఊరేగింపు చేరుకుంటుంది. అక్కడి నుంచి దుప్పల్లి మీదుగా మధ్యాహ్నం సమయానికి చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామంలోని ముక్కెర వంశస్తుడు రాజా రాంభూపాల్ నివాసానికి చేరుతుంది. అక్కడ భక్తులతో పాటుగా వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆభరణా లను దర్శించుకుంటారు. వేద పండితు లు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ తర్వాత మళ్లీ ఊరేగింపు ప్రారంభం అవుతుంది.



అమ్మాపూర్ మీదుగా జాతర మైదానానికి...

భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగింపు అమ్మాపూర్ గ్రామం మీదుగా సాయంత్రం సమయానికి కురుమూర్తి జాతర మైదానానికి చేరుకుంటుంది. అనంతరం దేవరగట్టు మెట్ల వద్ద ఆలయ అర్చకులు, వేద పండితులు, ప్రముఖులు ఆభరణా లకు ఘన స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత ఆభరణాల పెట్టెను గుట్టపై నున్న కాంచన గుహకు చేరుస్తారు. అనంతరం స్వామి వారికి ఆభరణాలను అలంకరిస్తారు. కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసన సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, దేవాదాయ శాఖతో పాటుట ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

ఆ టేస్టే వేరు!

- కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్ ప్రత్యేకం
- స్పెషల్ మసాలా కలపడమే అందుకు కారణం
- అమరచిత ఆరెకటికల ప్రత్యేక తయారీ

అమరచింత, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రతీది ఓ ప్రత్యేకం. ఉత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులు గుట్ట మీదున్న కాంచన గుహలో కొలువు దీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని కిందికి దిగగానే వారికి గుర్తుకొచ్చేది కాల్చిన మటన్. జాతర సందర్భంగా ఇక్కడ ప్రత్యేక మటన్ దుకాణాలు ఏర్పాటవుతాయి. వాటిలో కాల్చిన మటన్ తినేందుకు రాష్ట్రం నుంచే కాక పొరుగునున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా ఇష్టపడతారు. కాల్చిన మటన్, మటన్ ఫ్రై ఎక్కడైనా దొరుకుతుంది. కానీ ఎక్కడా లేనంత ప్రత్యేక రుచికరమైన మటన్ ఇక్కడే లభిస్తుంది. అందులో కలిపే ప్రత్యేక మసాలా వల్లే కాల్చిన మటన్‌కు ప్రత్యేక రుచి వస్తుంది.

50 రోజుల ముందే మసాలా తయారీ

కురుమూర్తి జాతరలో కాల్చిన మటన్‌కు తయారీకి వినియోగించే మసాలా తయారీ కూడా ఒక ప్రత్యేకం జాతరలో మటన్ దుకాణాలను తరతరాలుగా అమరచింత ఆరెకటిక కులస్తులే ఏర్పాటు చేస్తున్నారు. మటన్‌లో కలిపే మసాలా తయారీని వారు దసరా నవరాత్రుల అనంతరం నిష్ఠతో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభిస్తారు. దుకాణం ఏర్పాటు చేసే ప్రతీ వ్యాపారి జాతర నెల రోజుల్లో 100 యాటలు (జీవాలను) కోస్తారు. అందుకోసం 150 కిలోల మసాలాను సిద్ధం చేసుకుంటారు. అందుకోసం కారం 35 కిలోలు, అల్లం 30 కిలోలు, ఎల్లిపాయలు 30 కిలోలు, లవంగాలు, యాలకులు షాజీరా, చెంకా, మిరియాలు, తోక మిరియాలు కిలో చొప్పున అవసరం అవుతాయి. అలాగే రాతి పువ్వు, మరాఠీ మొగ్గ, జాపత్రి, జాజికాయ, బొప్పాయి పూత ఇలా 15 రకాల వస్తువులను మెత్తగా దంచాల్సి ఉంటుంది. ఇలా 15 రకాల దినుసులను కలిపి తయారు చేసిన 150 కిలోల ప్రత్యేక మసాలాను 50 రోజుల వరకు నిల్వ ఉంచుతారు. దీంతో అది మరింత ఘాటుగా మారుతుంది. ఈ మసాలను మటన్ దట్టించి కాల్చుతారు. దీంతో అది ప్రత్యేక రుచిని సంతరించుకుంటుంది.

మసాలాతోనే ప్రత్యేక రుచి

రఘురాం, అమరచింత : కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో మటన్ దుకాణాలను ఏర్పాటు చేయడం అనాదిగా వస్తోంది. ఇందుకోసం కుటుంబ సభ్యులందరం నిష్ఠగా పూజలు చేసి మసాలాను తయారు చేస్తాం. అందుకోసం నాణ్యమైన 15 రకాల దినుసులను వినియోగిస్తాం. ఇలా సిద్ధం చేసుకున్న మసాలాను మటన్‌లో కలిపి కాల్చడం వల్లే అది మరింత రుచికరంగా మారుతుంది.



మసాలాను సిద్ధం చేస్తున్న రఘురాం

వ్యవసాయ క్షేత్రాలా?

నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా?



వ్యవసాయ క్షేత్రంలోని ఫాం పాండ్‌ను పరిశీలిస్తున్న లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ బృందం

- విస్తుపోయిన లోకాయుక్త బృందం
- పోలేపల్లి పరిసరాల్లో క్షేత్ర స్థాయి విచారణ

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 'ఇవి వ్యవసాయ క్షేత్రాలా? నీటి అక్రమ వ్యాపార కేంద్రాలా?' అని క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మ్యాథ్యూకోషి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లోని బోర్ల నీటిని పంటల సాగుకు కాకుండా, సెజ్‌లోని ఫార్మ పరిశ్రమలకు విక్రయిస్తున్నారని, మరికొందరు వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్నారని పోలేపల్లి గ్రామానికి చెందిన మహేష్, రాఘవేందర్‌లతో పాటు మరికొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మాథ్యూకోషి, విచారణ కమిటీ సభ్యులు శివప్రసాద్, రాంరెడ్డిల బృందం మంగళవారం విచారణ చేపట్టింది. పోలేపల్లి పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఎకరం భూమి ఉన్న వ్యవసాయ క్షేత్రంలో మూడు, నాలుగు బోర్లు ఉండడం, ఫాంపాండ్ నిర్మాణాలను గుర్తించారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయలేదని, బోర్ల నుంచి నీటిని ఫాంపాండ్‌లో డంప్ చేస్తున్నారని గుర్తించారు. ఆ నీటిని మోటర్ల సహాయంతో వాటర్ ట్యాంకర్లలో నింపి ఫార్మా పరిశ్రమలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మోటర్‌లకు కమర్షియల్ విద్యుత్‌ను కాకుండా, వ్యవసాయ విద్యుత్‌నే వినియోగిస్తున్నట్లుగా తేల్చారు. దీంతో విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లడమే కాకుండా, భూగర్భజలాలు తగ్గిపోతున్నాయని బృందం సభ్యులు వెల్లడించారు.

ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారికి ఫోన్ చేసి ప్రశ్నించారు. విద్యుత్ దుర్వినియోగం అవుతోందని, ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖకు అధికారికంగా లేఖను పంపి స్వామని, లోకాయుక్త విచారణకు హాజరు కావాలని సూచించారు. అనంతరం సెజ్‌లోని హెటిరో ఫార్మ పరిశ్రమకు వెళ్లారు. కంపెనీకి అవసరమైన నీటిని ఎక్కడి నుంచి తెప్పించుకుంటున్నారని ఆరా తీశారు. పోలేపల్లి మాజీ సర్పంచ్ ఇంటి నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసుకొని, నీటిని కొనుగోలు చేస్తున్నామని పరిశ్రమల ప్రతినిధులు వారికి తెలిపారు. అంతకుముందు పోలేపల్లి పరిసర ప్రాంతాలలోని వ్యవసాయక్షేత్రాల సర్వే నెంబర్లను జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయ అధికారులతో తీసుకున్నారు. విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను లోకాయుక్తకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో గిర్దావర్ ఖదీర్‌తో పాటు గ్రామస్థులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

అర్చరీ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 5 : మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 ఎస్జీఎఫ్ అర్చరీ టోర్నీలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని సాయి సమీక్ష ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నది. గౌతమ్‌రెడ్డి నాలుగో స్థానంలో నిలిచాడు. గుజరాత్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి అర్చరీ పోటీల్లో వారిద్దరూ పాల్గొననున్నారు.

పురాతన విగ్రహాలను కాపాడుకోవాలి

- ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలి
- పురావస్తు శాఖ పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి
- తాడూరు మండలంలోని ఇంద్రకల్, భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామాల్లో పర్యటన





ఇంద్రకల్‌లోని ఇంద్రేశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఆలయంలోని విగ్రహం

తాడూరు/భూత్పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పురాతన విగ్రహాలను కాపాడుకోవాలని, ప్రాచీన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్, మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని కప్పెట గ్రామాల్లో పర్యటించారు. ఇంద్రకల్‌లో కాకతీయుల కాలం నాటి పురాతన ఇంద్రేశ్వరాలయాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్థులందరూ సహకరించుకొని ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటే ఎంతో అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ ఆలయాన్ని దాదాపు ఏడు వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు తెలిపారు. గుడిలోని మండపాలు, శివలింగం, దేవతా మూర్తులు, మహిషాసుర్దిని శిల్పం అద్భుతంగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌కు చెందిన ముచ్చర్ల దినకర్, ఎదిరేపల్లి కాశన్నలు ఇచ్చిన సమాచారం మేరకు ఆలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు జానయ్య, తిరుపతయ్య ఉన్నారు. అనంతరం భూత్పూర్ మండలంలోని కప్పెటలో ఆంజనేయస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. గుడిలోని 16వ శతాబ్దికి చెందిన వినాయక విగ్రహాన్ని చూశారు. ఇది దాదాపు నాలుగు వందల ఏళ్ల నాటిదని తెలిపారు. అనంతరం గ్రామంలో పునర్నిర్మిస్తున్న శివాలయాన్ని సందర్శించారు.

ఇంటర్వ్యూ..



శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కోడేరు ఎస్‌ఐ గోకారి

కోడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా మండల పోలీసు యంత్రాంగం పని చేస్తుందని కోడేరు ఎస్‌ఐ గోకారి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఏం జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. లైసెన్స్ లేని వారిపై, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమాని, నడిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాహనం నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెటు తప్పనిసరి చేశాం. రోడ్లపై వడ్లు, మొక్కలు తదితర ధాన్యం ఆరబెడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నామన్నారు.

మండలంలో కోడిపందేలు, పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయా?

మండలంలో రెండు చోట్ల కోడి పందేల వారిని పట్టుకున్నాం. మొత్తం 41 మందిపైన కేసులు నమోదు చేశాం. ఇరవై ఒక్క బైకులు సీజ్ చేశాం. పత్తాలాటలో రెండు కేసులు 11 మందిపైన కేసులు చేశాం. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగినట్లు అయితే తమకు సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేస్తున్నాం.

సైబర్ క్రైమ్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

సైబర్ క్రైమ్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్ చేసి ఓటీపీ, ఆధార్ నెంబర్, బ్యాంక్ ఖాతా నెంబర్ అడిగితే చెప్పకూడదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఒక వేళ చెపితే మీ ఖాతాలో డబ్బులు ఖాళీ అవుతాయని ఇక అక్కడ అక్కడ జరిగిన సంఘటనలను గురించి చెబుతూ అవగాహన కల్పిస్తున్నాం.

క్రైం కార్నర్

కూలి పనికి వచ్చి శవమై కన్పించాడు

- నాగర్‌కర్నూల్‌లో ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూలి పని కోసం వచ్చిన బాచి రాముడు(40)మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన బాచి రాముడు ప్రతీ రోజు నాగర్‌కర్నూల్‌కు వచ్చి మేస్త్రీ పని చేసి, సాయంత్రం స్వగ్రామం వెళ్లేవాడు. రోజువారీగానే సోమవారం ఉదయం వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లలేదు. ప్రతీ రోజు నాగర్‌కర్నూల్‌కు వచ్చి పని చేసి మద్యం తాగేవాడని, అదేవిధంగా సోమవారం రాత్రి కూడా మద్యం సేవించి బస్టాండ్ సమీపంలో కింద పడి మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటన ఆ గ్రామానికి చెందిన కొందరు గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. ఈ సంఘటనపై మృతుని భార్య బాచి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తన భర్త మృతిపై తనకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

అచ్చంపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మతం పేరుతో కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వ్యక్తిపై అచ్చంపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పట్టణానికి చెందిన శివాజీ ఈనెల 2న తన ఫోన్ వాట్సాప్ గ్రూపులో ఓ మతాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. కొందరు గమనించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో సివిల్ న్యాయాధికారి ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.

రాయితీ పరికరాలు ఏవీ ?

- రైతులకు అందని స్ప్రింక్లర్లు, డ్రిప్పు పైపులు
- గ్రామాలలో కనపడని హార్టికల్చర్ సిబ్బంది
- రాయితీ పరికరాలు అందేలా చూడాలంటున్న అన్నదాతలు



సిర్సవాడ వద్ద స్ప్రింక్లర్ల సహాయంతో మొక్కజొన్నకు నీరందిస్తున్న అన్నదాత (ఫైల్)



యాదిరెడ్డిపల్లిలో పత్తి పంటలో స్ప్రింక్లర్లతో నీరందిస్తున్న అన్నదాతలు (ఫైల్)

తాడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలు రబీలో సాగు చేసే అన్ని పంటలకు స్ప్రింక్లర్లతోపాటు డ్రిప్ పైపుల సహాయంతో పంటలకు సాగునీరు అందించే పరిస్థితులు ఉంటాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై స్ప్రింక్లర్ పైపులు, డ్రిప్ పైపులతో పాటు ట్రాక్టర్లకు అవసరమైన వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన సామగ్రి రాయితీపై అందించకపోవడం మూలంగా అన్నదా తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రైతులకు గ్రామాలలో తిరుగుతూ తుంపర సేద్యం పై ఇతరత్రా కార్యక్రమాలపై, పండ్ల తోటలు, కూరగాయల తోటల వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ ఆ దిశగా సమాయత్త పర్చాలని హార్టికల్చర్ సిబ్బంది గ్రామాలల్లో కన్పించకపోవడం మూలంగా అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాలల్లో హార్టి కల్చర్ అధికారులు పర్యటించేలా చర్యలు తీసుకుని రైతులకు అవసరమైన స్పింక్లర్లు, డ్రిప్ పైపులతో పాటు అవసరమైన వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లోని అన్నదాతల తుంపర సేద్యంపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు స్పింక్లర్, డ్రిప్ పైపుల కోసం దరఖాస్తులు చేసుకుని సీరియల్ నెంబర్లల్లో ఉన్నట్లు తెలు స్తోంది. ఏదేమైనా ప్రభుత్వం తుంపర సేద్యంపై రాయితీ పరికరాలపై వెంటనే అందించడంతోపాటు హార్టికల్చర్ సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులను సమాయత్తపరిస్తే మరింత ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- డ్రోన్ పైలెట్ శిక్షణలో యువకులకు జూపల్లి అరుణ్ పిలుపు



డ్రోన్ శిక్షణలో మాట్లాడుతున్న జూపల్లి అరుణ్

కొల్లాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా తార యుఏవీ వారి సహకారంతో హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో మొదటి విడతగా 12 మంది నియోజకవర్గ యువకుల కు 12 రోజుల పాటు నిర్వహించే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నేడు రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ ప్రారంభించారు. రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జూపల్లి అరుణ్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత టెక్నికల్ రంగాల వైపు అడుగులు వేసి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తామని యువకులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో తార యుఏవి మేనేజింగ్ ఆపరేషన్స్ డ్రోన్ ట్రైనర్ విజయ్, ట్రైనర్ శ్రీనాథ్, ప్రవీణ్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే మంత్రి జూపల్లి లక్ష్యం

- మునిసిపల్ చైర్ పర్సన్ రమ్య



సమస్యలు తెలుసుకుంటున్న మునిసిపల్ చైర్‌పర్సన్

కొల్లాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పని చేస్తున్నారని మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 5వ వార్డులో ప్రభుత్వ జిల్లా పరిషత్ మోడల్ పాఠశాలను మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహమూద బేగం, కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే పాఠశాల కంపౌండ్ వాల్‌కు రూ. లక్ష మంజూరు చేయడం జరిగింది. అనంతరం విద్యార్థినులకు అందించే డిజిటల్ బోధన గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, ఖాదర్ పాషా, ఏఈ సాయిరాం, పాఠశాల యాజమాన్యం, వార్డు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తిశ్రద్ధలతో దీపారాధన



రామాలయంలో దీపారాధనలో పాల్గొన్న మహిళా భక్తులు

కందనూలు/ అచ్చంపేటటౌన్/ మన్ననూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో చవితి రోజు జంట నాగుల స్వామి వారిని నాగులను, పుట్ట వద్ద నాగులకు పూజించిన వారికి విశేష పుణ్యఫలం దక్కుతుందని దేవాలయంలో కార్తీక ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు పితృల నుంచి ఆశీస్సులు అందుతాయని రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో సామూహికంగా జంటనాగుల స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతం అభిషేకాలు, అష్టోత్తర నామాలతో అర్చనలు చేశారు, జంట నాగుల స్వామి పూజించిన వారికి సంతానం, ఐశ్వర్యం, చెవ్వు, చర్మ వ్యాధుల నుంచి విముక్తి, ఆరోగ్యం లభిస్తుందన్నా రు. శివాలయం, రామాలయం ముందు దీపారాధనలో, దీపదానంలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్థం రవీందర్, మల్లేష్, గొల్ల రాములు, మన్నెపురెడ్డి, నందకిశోర్, పుల్లయ్య, లక్ష్మీ, కవిత, సుజాత, విజయ్, గిరి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి

అచ్చంపేట పట్టణంలోని శివాలయంతో పాటు కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శివాలయంలో మహిళలు శివున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా మండల పరిధిలోని పలకపల్లి గ్రామ శివాలయంలో మహిళలు పుట్టచుట్టూ దీపాలు వెలిగించి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శివాల యంలో అభిషేకాలు చేశారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో..

అమ్రాబాద్ మండలం మన్ననూరు వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నాగులు విగ్రహాలకు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నాగేంద్రస్వామికి నైవేద్యం పెట్టారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వర పాలక మండలి డైరెక్టర్ సంభు శోభ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, పులిజాల శేఖర్, పద్మజ, జయమ్మ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

వరికొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కల్వకుర్తిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్నీ రకాల వసతులు కల్పించాలని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దాన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పీపీసీ సెంటర్లలో పనిచేసే ఇన్‌చార్జిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా అమలుచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండే నిర్వాహకులు స్థానికంగానే ఉండాలని, సెంటర్‌వద్ద రైతులు బారులు తీరకుండా ఉండేందుకు చీటీలు అందజేయాలని తెలిపారు. అమ్మిన రైతువద్ద ఆధార్‌కార్డు, వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ శ్యామ్‌సుందర్, డైరెక్టర్లు వెంకటయ్య, ఫరీద్, సీఈవో వెంకట్‌రెడ్డి, పీపీసీ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రైతులకు పాల బిల్లులు తక్షణమే చెల్లించాలి : బీఆర్‌ఎస్

ఉప్పునుంతల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు పాల బిల్లులు తక్షణమే చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీంద్రారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని వివిధ గ్రామాల పాల రైతులకు ప్రభుత్వం చాలా రోజుల నుంచి బిల్లులు చెల్లించడంలేదన్నారు. పశువుల పోషణ రైతులకు భారంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. పాల బిల్లులు రాక రైతులు అప్పులు చేస్తే మరి కొందరు పశువులను అమ్ముకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. పాల రైతులకు వెంటనే పాల బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో పాల రైతులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

మూడు రోజుల గడువుతో నోటీసులు జారీ

పదర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సోమవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన "నిరుపయోగంగా బస్టాండ్" అనే కథనానికి స్పందిస్తూ మండలంలోని చిట్లంకుంట గ్రామంలో బస్టాండ్ ముందున్న హోటల్‌ను తొలగించాలని హోటల్ యజమానికి ఎంపీడీవో బాల చందర్‌సృజన్ ఆదేశాలమేరకు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు మూడు రోజుల గడువు ఇస్తూ నోటీసులు జారీ చేసినట్లు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. గ్రామస్థులు, యువకులు, మహిళలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాతాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త వడ్డె సత్యం పక్షవాతం వ్యాధి సోకి బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జల పరమేష్ బాధితుడు వడ్డె సత్యంకు పదివేల రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో జీకే కుర్మయ్య, శ్రీను దవడ రాముడు, కురుమయ్య, పరశురాముడు ఉన్నారు.

సర్వేలో వివరాలు చెప్పాలి

చారకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ఇంటికి వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మండలంలో బుధవారం నుంచి సర్వే ప్రారంభం కానుందని, అందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సర్వే ఈనెల చివరి వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

పెద్దకొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఈ నెల 6వ తేదీన నిర్వహించే దీక్ష కార్యక్రమానికి అనుమతి సెలవు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీవో నాగేంద్రంకు వినతి పత్రం సమర్పించారు. నాలుగైదు నెలల నుంచి వేతనాలు రావడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి డి.చంద్రయ్య, నాయకులు మాశన్న, వెంకటయ్య, శ్రీను, మైసమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

'ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలి'

తిమ్మాజిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని సీనియర్ మేట్ల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్లుగా పని చేస్తున్న వారిని గుర్తించి వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరుతూ ఎంపీడీవో లక్ష్మీదేవికి సీనియర్ మేట్లు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి, సీనియర్ మేట్లకు అవకాశం ఉన్న గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అనిత, సంతోష్, రమేష్, కుర్మయ్య, సత్యం, మహేష్, రాజు పాల్గొన్నారు.

తండాలకు బస్సులు నడపాలి : మాజీ జడ్పీటీసీ

పదర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ తండాకు బస్సు నడపాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు నాయక్ కోరారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే ఉచిత బస్సు పథకానికి చెంచులు, తండా గిరిజనులు అర్హులు కారా అని ప్రశ్నించారు. వెంటనే మండలంలోని పిల్లిగుండ్ల చెంచుపెంటతో పాటు, బాపన్‌పాడు, జ్యోతినాయక్ తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు, ఆర్‌టీసీ ఎండీ దుర్గాప్రసాద్‌కు వేర్వేరుగా వినతులను పోస్ట్ చేశానని తెలిపారు.

వాహనాల తనిఖీ

చారకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ శంషుద్దీన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకొంటాయని అన్నారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలను తప్పని సరిగా వెంట ఉంచుకోవాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎస్‌ఐ శంషుద్దీన్ వెంట హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం, కానిస్టేబుళ్లు ఉన్నారు.

వరికి మద్దతు ధర పొందాలి

- జిల్లా సహకార శాఖ అధికారి రఘునాథ్‌రావు
- సిర్సవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సిర్సవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో రఘునాథ్ రావు, సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్

తాడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరిని తెలంగాణ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్ర యించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా డీసీవో రఘునాథ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని సిర్సవాడ గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కో ఆపరేటివ్ అధికారి రఘునాథ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బోనస్‌తో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వ హిస్తు న్నందున ప్రతీ రైతు కొనుగోలు కేంద్రాల వద్ద నే ధాన్యాన్ని విక్రయించుకో వాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అవసర మైన సహాయ సహకారాలను అందిస్తుంద న్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది, సిర్సవాడ గ్రామ రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల

వంగూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టసదగోడు మాజీ సర్పంచ్ సురేందర్ కుటుంబాన్ని మంగళవారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. ప్రమా దవశాత్తు సురేందర్ విద్యుదాఘా తంతో మృతి చెందడం దురదృష్ట కరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అం డగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంద రాజేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, అంకు సురేందర్ తదితరులు ఉన్నారు.

కష్టపడితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- కల్వకుర్తి సీఐ బి.నాగార్జున

కల్వకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదివితేనే ఉజ్వ ల భవిష్యత్తు ఉంటుందని కల్వకుర్తి సీఐ బి.నాగార్జున అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జూనియర్ విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం ప్రిన్సిపాల్ శర్వాణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐ బి.నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా ఇతర అంశాల్లో సైతం నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు హాస్టల్ వసతి సైతం అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ నాగార్జున కోరారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు రాజు, శ్యాంసుందర్, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మల్లేష్‌యాదవ్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వై.లక్ష్మణ్‌రావు

కందనూలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వై.లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీసీపీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థతో పాటు జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరుగుతుందన్నారు. గ్రామాలలో 18 సంవత్సరాల లోపు పిల్లలు బడి బయట ఉండకుండా అందరినీ పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరయ్యేలా కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా పిల్లలు పనుల్లో ఉన్నా, బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 1098కు సమాచారమివ్వాలని సూచించారు. కోనేరు సంస్థ డైరెక్టర్ సలీం, డీసీపీయూ శ్రీశైలం, జిల్లా లేబర్ ఆఫీసర్ రాజు కుమార్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రసన్న, లక్ష్మయ్య, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ అంజనేయులు, అడిషనల్ కో ఆర్డినేటర్లు ఎం.శ్రీనివాస్‌యాదవ్, జాకీర్ హుసేన్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తల సూచనలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

తిమ్మాజిపేట/ మన్ననూర్, న వంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. సీజన్‌లో వేసే పంటల వివరాలు ఆయా పంటలకు సంబంధించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ప్రతీ వారం జరిగే వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు చేస్తున్నారు. ఈ వీసీలో మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్, ఏఈవోలు సాయిరాం, శివకుమార్, అబ్దుల్ నవాజ్, నాజ్మీన్, శివసాగర్, సాహిత, హేమలత పాల్గొన్నారు.

అమ్రాబాద్ మండలం మన్ననూరు రైతు వేదిక వద్ద టెలీకాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. వేరుశెనగ పంటకు పొగాకు లద్దెపురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం.రాంప్రకాశ్, డాక్టర్ రామకృష్ణ బాబు లు తెలిపారు. ఏఈఓలు సీతారాం నాయక్, భార్గవి, మౌనిక పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజిరెడ్డి
- తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తపస్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక పరమైన అంశాలతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు దెంది రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త ధర్మాగ్రహ దీక్ష పిలుపులో భాగంగా తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను నవంబరు 22 లోగా పరిష్కరించకపోతే హైదరాబాదులో ధర్మాగ్రహ దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనమోని శేఖర్, రాష్ట్ర బాధ్యులు డాక్టర్ సురేఖ, శ్రీనివాసులు, పెంట్యానాయక్, జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, జగదీష్, విజయ్‌రెడ్డి, హరికృష్ణ, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘు, గోవింద్ రెడ్డి, నారాయణరెడ్డి, సతీష్‌కుమార్, సూర్యనారాయణ, రాజవర్ధన్‌రెడ్డి, మల్లేష్, నిరంజన్, కృష్ణప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ ఎన్నికల హామీలు నెరవేర్చాలి : బీఎస్పీ

తెలకపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు బండి పృథ్వీరాజ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం బీఎస్పీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే సిలిండర్, మండలానికో ఇంటర్నేషనల్ పాఠశాల అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు సి.కల్యాణ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను, రైతు సమస్యలను పరిష్కరించకుండా రైతులను మనోవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బాలనాగయ్య, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివుడు, కార్యదర్శి సామ చెన్నయ్య, నాయకులు నాగరాజు, రాజేష్, సుధాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.